# కాంగ్రెస్ తప్పించుకోలేదు

## సోనియా సమాధానం చెప్పాల్సి వస్తుంది ☆ నేతల అవినీతిపై చంద్రబాబు హెచ్చరిక

ఒంగోలు - న్యూస్‌టుడే

"తప్పు చేసిన కంపెనీనే ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి అందలం ఎక్కించారు. తన కుమారుడికి చెందిన రఘురాం సిమెంట్ కంపెనీ నిర్మాణ బాధ్యతలు కూడా అప్పగించారు. నిర్మాణంలో ఉండగానే అది కూలి ఒకరు చనిపోయారు. కొందరు గాయపడ్డారు. సంఘటన తెలుసుకుని వెళ్లిన 108ను లోపలకు రానివ్వలేదు. మీడియాను అనుమతించలేదు. రఘురాం సిమెంట్ కంపెనీలో ఏం జరుగుతోందో సీఎం చెప్పాలి" అని తెలుగుదేశం అధినేత చంద్రబాబు డిమాండ్ చేశారు. ఏరువాకలో భాగంగా ప్రకాశం జిల్లా వచ్చిన చంద్రబాబు శుక్రవారం ఉదయం ఒంగోలులోని జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్‌లోని పంజగుట్ట ఫ్లైఓవర్ కూలిన సంఘటనపై ముఖ్యమంత్రి ఒక కమిటీని నియమించారని గుర్తు చేశారు. నిర్మాణదారు అయిన గామన్ ఇండియాను తప్పుపడుతూ కమిటీ నాలుగు నెలల కిందటే నివేదిక ఇచ్చినా వైఎస్ ఎలాంటి చర్యా తీసుకోలేదన్నారు. పైగా, తన కుమారుడు నిర్మిస్తున్న రఘురాం సిమెంట్ కంపెనీ బాధ్యతను అప్పగించడం శోచనీయమని విమర్శించారు. గామన్ ఇండియా యాజమాన్యం ప్రతినిధులు సీఎంకు దగ్గరివాళ్లు కావడమే ఇందుకు కారణమన్నారు. కాంగ్రెస్ హయాంలో అవినీతి విశృంఖలమై పోయిందని దుయ్యబట్టారు.

నేదురుమల్లి హయాంలో అక్రమంగా ఇచ్చిన చీమకుర్తి గ్రానైట్ లైసెన్సును తమ ప్రభుత్వ హయాంలో రద్దు చేయించామని చంద్రబాబు చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వం క్యూబిక్ మీటరుకు రూ.44,900 చొప్పున లీజుకు ఇస్తే ఇప్పుడు రూ.4,600కే జింపెక్స్‌కు ఇచ్చారని ఆరోపించారు. ఇదో బినామీ కంపెనీ అని, తాజా చర్యతో దాదాపు పదివేల కోట్ల రూపాయలు దోచిపెట్టినట్లేనని అన్నారు. 'వ్యక్తులు తప్పించుకోవచ్చు. కానీ, కాంగ్రెస్ పార్టీ ప్రజల ముందు దోషిగా నిలబడాల్సి వస్తుంది. ఆరోజు దగ్గరలోనే ఉంది. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సోనియా సమాధానం చెప్పేరోజు వస్తుంది' అని బాబు హెచ్చరించారు.

**రైతు గోడు పట్టదా!:** అవినీతి ఊబిలో కూరుకుపోయిన ముఖ్యమంత్రి రైతుల గోడు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వాల విధానాల కారణంగా రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులు, విత్తనాలకొరత, విద్యుత్తుకోత, మరోవైపు అందని గిట్టుబాటు ధరతో రైతు సతమతం అవుతున్నాడని తెలిపారు. 2005-06లోనే 2,500మంది రైతులు రాష్ట్రంలో ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. ఇందుకు సిగ్గుపడాల్సిన సీఎం రైతులు సంతోషంలో ఉన్నారని, పండుగ చేసుకుంటున్నారని చెబుతున్నారన్నారు.

**పొగాకు రైతుకు బాసట:** పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. తమ ప్రభుత్వ హయాంలో అపరాధ రుసుం 5 శాతం ఉంటే ప్రస్తుతం 15 శాతానికి పెంచారని ఆరోపించారు. పైగా పరిమితులు విధించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఏరువాకలో భాగంగా తూమాడులో పొగాకు బ్యారన్ దగ్గరకు వెళ్లి ధరల గురించి అడిగి తెలుసుకున్నారు.

**బెల్ట్‌షాపులు ఎత్తేస్తాం:** సాధువారిపాలెంలో ఒక మహిళ కన్నీళ్ల పర్యంతం అయ్యారు. విచ్చలవిడి మద్యంతో చచ్చిపోతున్నామని చెప్పారు. చంద్రబాబు స్పందిస్తూ, తాము అధికారంలోకివస్తే బెల్ట్ షాపులను ఎత్తేయిస్తామని హామీఇచ్చారు.